




కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు..
వెర్రెక్కి ఉన్నోళ్లు..
కళ్లాలే లేనోళ్లు.. హద్దులేవి
లేనివాళ్లు.. ఆవేశం
ఉన్నవాళ్లు.. గతమును
పూడ్చేది వీళ్లు.. చరితను
మార్చేది వీళ్లు.. కథలై
నిలిచేది వీళ్లు.. కలలకు
పందిళ్లు వీళ్లు.. వీళ్లేనోయ్ నేటి
మొనగాళ్లు.. ప్రస్తుత ఎన్నికలకు ఈ పాట అతికినట్టు సరిపోతోంది. ఎందుకంటే ఈ రాష్ట్ర భవిష్యత్ యువత చేతుల్లోనే ఉంది.. ఈ ఎన్నికల మలుపు తిప్పేది.. గెలుపు వాకిట నిలిపేది యువతే.. ప్రస్తుతం వారి ఓటు కీలకం కానుంది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లెక్కలు తీస్తే ఎంత కీలకమో అర్థమైంది.. ప్రస్తుతం మూడో వంతు ఓటర్లు వారే ఉన్నారు. కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం పార్లమెంటుల పరిధిలో మొత్తం 47.81 లక్షల మంది ఉన్నారు.. ఈ సంఖ్యలో 9.31 లక్షలు యువ ఓటర్లే.. వీరిలో తొలి ఓటు వేసేవారు అధికంగానే ఉన్నారు.. ఈ సమయంలో ఎవరు ఎటు వైపు ఉన్నారనేది అభ్యర్థులకు అంతుచిక్కని ప్రశ్న.. ముఖ్యంగా యువత మనసులో ఏముందో తెలుసుకునేందుకు 18 నుంచి 29 ఏళ్ల మధ్య ఉన్న యువతను ప్రశ్నిస్తే.. మార్పు రావాలి.. కావాలి అంటున్నారు..



చరితను.. మార్చేది వీళ్లు!

యువతరం ఓటెటో.. 2024 తీర్పటు!

- మరో మూడు రోజులు..72 గంటల్లో ఓటరు తీర్పు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యువతరం ఓట్లే కీలకం
- ఈ దఫా తొలిసారి ఓటుహక్కు కలిగినది లక్ష మందిపైనే
- కాకినాడ జిల్లాలో 52 వేలు, తూ.గో.జీ 40 వేలు, కోనసీమ 36 వేలు
- మొత్తం ఓటర్లు 47.81 లక్షలు... యువత 9.31 లక్షలకుపైగా
- ఈసారి నిర్ణయాత్మక శక్తి యువతరమే
- జగన్ సర్కారులో నిలువునా దగాపడ్డ యువత
- యువతకు కూటమి మేనిఫెస్టోలో పట్టం



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఓటంటే వజ్రాయుధం.. ప్రజల తలరాతలు మార్చే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి లభించే ఒకే ఒక్క అవకాశం.. అధికారం అండతో చెలరేగే నేతల ఆటకట్టించే పాశుపతాస్త్రం.. ధర్మాన్ని కాపాడే ఏ ఒక్క అవకాశాన్ని ఎవరూ వదులుకోకూడదు. ఓటు కూడా అలాంటి ఒక్క అవకాశమే. అలాంటి అవకాశం ఐదేళ్ల తర్వాత మళ్లీ వస్తోంది. మరో మూడు రోజులు.. 72 గంటల్లో అసెంబ్లీ ఎన్నికల ఓటు వేసే సువర్ణావకాశం లభిస్తోంది. ఈనేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ దఫా ఎన్నికల్లో యువతరం ఓటు అత్యంత కీలకం కాబోతోంది. జిల్లాలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా అత్యధికంగా ఉన్న మహిళా ఓటర్లే కీలక నిర్ణేతలుగా మారుతున్నారు. కానీ ఈసారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకుంటున్న యువత సైతం అత్యంత కీలకంగా మారనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని (నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం సహా) 22 నియోజకవర్గాల్లో 47.81, లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అంటే కాకినాడ, రాజమండ్రి, అమలాపురం పార్లమెంటు పరిధిలోని ఓటర్లు వీరు. వీరిలో 1,29,920 మంది వరకు తొలిసారి ఓటు అవకాశం దక్కించుకున్నారు. వీరిలో కాకినాడ జిల్లాలో 52 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 40,509, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 37,411 మంది యువ ఓటర్లు ఉన్నారు. వీరంతా తొలిసారి తమ ఓటు హక్కుతో తీర్పు నివ్వనున్నారు. వీరంతా ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తిగా మారింది. అటు ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్లలో 18 నుంచి 29 యువ ఓటర్లు 9.31 లక్షల మంది వరకు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సరైన ప్రభుత్వాన్ని ఎంచుకునే అంశంలో వీరి పాత్ర అత్యంత కీలకంగా మారనుంది.



అయితే ఈ దఫా యువతరం ఓటు ఎవరికి అనేది అనేక ఆకాంక్షలతో ముడిపడి ఉంది. గత ఎన్నికల సమయంలో ఏటా జాబ్ క్యాలెండర్, డీఎస్సీ, పారిశ్రామిక రంగంలో అద్భుత ఉపాధి అవకాశాలు అంటూ జగన్ సర్కారు నమ్మించి ఆనక అధికారంలోకి వచ్చాక యువతను నిలువునా వంచించింది. దీంతో వారంతా వైసీపీ సర్కారుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహంగా ఉన్నారు. ఐదేళ్లుగా జాబ్ నోటిఫికేషన్ల నుంచి డీఎస్సీ, ఇతర పోస్టుల వరకు ఏవీ భర్తీ చేయకుండా యువతరాన్ని నట్టేట ముంచారనే అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది. కొత్త పరిశ్రమలు రాక, ఉన్నవాటిని బెదిరించి తరిమేశారన్న ఆగ్రహావేశాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యువతరాన్ని కుదిపేస్తున్నాయి. ఇదే సరైన ప్రభుత్వాన్ని ఎంచుకోవాలన్న ఆకాంక్ష వైపు నడిపిస్తోంది. జిల్లాలో గడచిన కొన్ని వారాలుగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల పర్యటనలో యువత ఎక్కడికక్కడ ప్లకార్డులు పట్టుకుని జాబ్ క్యాలెండర్, ఉపాధి అవకాశాలు కావాలంటూ తమ ఆవేదన వ్యక్తం చేసిన తీరు త్వరలో జరగనున్న యువతరం ఓట్ల గమ్యమెటో చాటినట్టయింది. వీరి ఆకాంక్షలకు తగ్గట్టుగానే టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల భర్తీ.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పన, డీఎస్సీ నోటిఫికేషన్ అనే అంశాలపై తమ పాలనా అజెండాకు రూపకల్పన చేసి యువతరానికి పట్టం కట్టినట్టయింది. యువత ఓట్లు.. తొలి ఓటు వేయబోతున్న టీనేజర్ల ఓట్లు ఎటువెళతాయోనన్న ఆందోళన వైసీపీలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. యువత ఓట్లకు గాలం వేసేందుకు వైసీపీ కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

ఐదేళ్లూ.. ఉపాధి ఉఫ్..

- చదువుకున్నా ఉపాధి లేదు... ఐదేళ్లూ నిర్వీర్యం
- ఒక్క ఐటీ ఉద్యోగమూ రాలేదు
- సాఫ్ట్‌వేర్ కొలువుకు బెంగళూరు, హైదరాబాద్
- విభజిత రాష్ట్రంలో ఐటీ కంపెనీల మాటే లేదు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

యువత ఆకాంక్ష ఒకటే.. ఉద్యోగం.. వారి కోరిక ఒకటే.. ఉపాధి.. ఐదేళ్లుగా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూపులతోనే కాలం గడిచిపోయింది.సర్కారు కొలువులకు ప్రకటనలు లేవు. చదివినా నయాపైసా ఉపయోగం లేదు. ఐటీ చదివిన పిల్లల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్కటీ చెప్పుకోదగిన ఐటీ కంపెనీ రాష్ట్రానికి రాలేదు. చంద్రబాబు హయాంలో వచ్చిన ఐటీ కంపెనీలు సైతం మూతపడ్డాయి. హైదరాబాద్‌లో చంద్రబాబు నిర్మించిన హైటెక్ సిటీని తలచుకుంటూ యువత కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు అనేకం. ఐటీ చదివిన పిల్లలు కొలువుల కోసం డిగ్రీ సర్టిఫికెట్లు బ్యాగులో పెట్టుకొని పొట్ట చేతపట్టుకొని బెంగళూరు, హైదరాబాద్‌కి వలస వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఉన్నతస్థాయి ఉద్యోగాలకు యువత కోచింగ్ సెంటర్లలో మగ్గిపోతోంది. ఇంటి నుంచి డబ్బులు పంపించమని అడగడానికి డిగ్రీలు అడ్డొచ్చి నలిగిపోతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మెగా డీఎస్సీ అంటూ సర్కారు దగా చేసింది. మరో వైపు పీజీలు చదివిన వాళ్లతోనూ జగన్ సర్కారు బంతాట ఆడుకొంది. షాపింగ్ మాల్స్ హోటళ్లు తదితర ప్రైవేటు ఉద్యోగాలు నెలకు రూ.10 వేల జీతంతో చేయాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది.దీంతో యువత విసిగిపోయింది. తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతీ యువకులు 'ఫ్యాను' అంటే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ చదువులకు తగిన ఉపాధి చూపించే పాలకులు కావాలని కోరుకుంటున్నారు. చంద్రబాబు హయాంలో ఎప్పుడూ ఈ ఐదేళ్ల మాదిరి దుస్థితి అనుభవించలేదని వాపోతున్నారు. కాస్త అటూఇటూ అయినా సర్కారీ కొలువులకు నోటిఫికేషన్లు వచ్చేవి.. ఐటీ చదివిన పిల్లలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రాష్ట్రంలోనే దక్కేవని గుర్తు చేసుకుంటున్నారు. మరో వైపు చంద్రబాబు తీసుకొచ్చిన నైపుణ్య శిక్షణ (స్కిల్ డెవలప్ మెంట్) పడకేసింది.చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నైపుణ్య శిక్షణ ఏర్పాటుచేసి వేలాది మంది వివిధ చేతివృత్తులు, ఉత్పత్తుల తయారీలో తర్ఫీదు ఇచ్చేవారు.యువతకు ఉపాధి లభించేది. అందువల్ల మళ్లీ అలాంటి రోజులు రావాలని యువత కోరుకుంటున్నారు. తొలిసారి ఓటు వేసే కొందరు తమ ఓటు రద్దుగా పోకూడదని, ఈ రాష్ట్రానికి మళ్లీ అన్యాయం జరగకూడదని ఆకాంక్షిస్తున్నారు.

సమాజంలో మార్పు తెచ్చే నేతకే ఓటు



సమాజంలో మార్పు తెచ్చే నాయకుడికే నా తొలి ఓటు. చదువు పూర్తయినా యువతకు ఉద్యోగాలు లభించడం లేదు. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలి. మహిళలకు రక్షణ కల్పించే చట్టాలు తేవాలి. సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధిచేయాలి.
- సంగన ప్రియ, బీటెక్ , పిఠాపురం

ఇదీ యువగళం..

ఉద్యోగావకాశాలకు..పక్క రాష్ట్రం వెళ్లా..



నా పేరు మౌనిక. గతేడాది ఇంజనీరింగ్ పూర్తిచేశా. ప్లేస్‌మెంట్లు లేక పక్క రాష్ట్రానికి శిక్షణకు వెళ్లా. అక్కడే ఉద్యోగాన్వేషణలో ఉన్నా.మన రాష్ట్రంలో నాలా చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు ఎక్కడు ఉన్నాయ్.. నాలో ఎంతో మంది పక్క రాష్ట్రంలో ఉంటున్నారు.. నా పేరు లహరిక.. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నా. నాకంటే ముందు చదువుకున్న వారికి కూడా ఉద్యోగాలు లేవని తెలిసి బాధేసింది. చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు హామీ ఇచ్చింది టీడీపీయే. ఉద్యోగావకాశాలు కల్పించే వారినే ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. - జి.మౌనిక, జి.లహరిక, అక్కాచెల్లెళ్లు, అమలాపురం

భవిష్యత్తుకు భరోసా ఇచ్చేవారికే ఓటు



భవిష్యత్తుకు భరోసా కల్పించే వారికే నా ఓటేస్తా. ఉద్యోగాల కల్పనతో పాటు స్వయం ఉపాధి పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాష్ట్రానికి ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి పెట్టాలి.ప్రజాప్రతినిధులు తప్పు చేస్తే శిక్షించేందుకు స్వతంత్ర వ్యవస్థ ఉండాలి.
- గుండారపు శ్యామ్, డిగ్రీ విద్యార్థి, చిట్టోడితోట, పిఠాపురం

నా తొలి ఓటు.. మంచివ్యక్తికే..



సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నా. నా ఓటు యువతకు ఉపాధి ఎవరైతే కల్పిస్తానంటారో వారికే వేస్తా. మంచి వ్యక్తిత్వం కలిగి ఉన్న నాయకుడు కావాల నేది నా ఆశ. తొలి ఓటు కాబట్టి ఓటు గుర్తుండిపోయేలా వేస్తా.
- గోపల విజయరాణి, తాడిమళ్ల, నిడదవోలు మండలం

ఉపాధి కల్పించేవారికే ఓటు..



ఉచితాలేకాకుండా అభివృద్ధి చేసేవారికే ఓటువేయాలి. కేవలం ఉచిత పథకాలపై ఆధారపడితే పరాన్నజీవులుగా మారిపోతాం. ఉచిత పథకాలు ఆర్థికాభివృద్ధికి అవరోధం. ఉపాధి మార్గాల ద్వారానే అభివృద్ధి సాధ్యం.ఉపాధి కల్పించే వారికే నా ఓటు.
- నిమ్మకాయల రామ్‌చరణ్, ఇంజనీరింగ్, ముమ్మిడివరం

సమాజంలో మార్పు రావాలి



అవినీతిరహిత పాలన అందించే వారినే పాలకులుగా ఎన్నుకోవాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం.నోటుకు ఓటు అమ్ముకుంటే ప్రశ్నించేతత్వాన్ని కోల్పోతాం. దీని వల్ల పాలకుల్లో అవినీతి పెరుగుతుంది. ఓటర్లలో మార్పు వస్తేనే సమాజానికి మేలు జరుగుతుంది.
- మట్టా విజయ, బీకాం విద్యార్థిని, ముమ్మిడివరం

సంపదను మనమే సృష్టించుకోవాలి



మన సంపద మనమే సృష్టించుకునే దిశలో ఉండాలి.పాలకులు స్కిల్ డెవలప్ మెంట్ హబ్‌లు ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించాలి. యువతరం ఉపాధి కల్పనకు కృషి చేసే వ్యక్తికే నా ఓటు వేస్తా. ఎవరు వచ్చినా యువతకు ఏదో ఒకటి చేయాలి.
- కదలి త్రిషాభవానీ, బీకాం, రాజుపాలెం, ముమ్మిడివరం

వైసీపీ పాలనలో అంతా నిరుద్యోగులే..



వైసీపీ పాలనలో కంపెనీలు రాక చదువుకున్న యువత అంతా నిరుద్యోగులుగా మారారు. డిగ్రీ చదివి ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా.ఏ ప్రభుత్వం వచ్చినా యువతకు ఉపాధి కల్పించి తమ కాళ్ల మీద తాము నిలబడేలా ప్రోత్సహించాలి.
- కమ్మండి సాయిభగవాన్, మల్లేపల్లి, గండేపల్లి మండలం

సమాజంలో మార్పు తెచ్చే నేతకే ఓటు



సమాజ శ్రేయస్సుకు పాటుపడే వ్యక్తిని ఎన్నుకోవాలి.నిజాయితీగా ఓటు వేసి నీతిమంతులను ఎన్నుకుంటే సమాజానికి మేలు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తినే ఎన్నుకోవాలి. తద్వారా సుపరిపాలన సాధ్యమవుతుంది.
- విళ్ల శ్రీరేణుక, ఎంబీఏ విద్యార్థి, ముమ్మిడివరం

నేడు పవన్‌కల్యాణ్ రోడ్‌షో

- పిఠాపురం నియోజకవర్గంలో మూడు చోట్ల స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్
- ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్న పవన్
- ఉప్పాడలో బహిరంగ సభ

7లో

పవన్‌పై ఇదేం కక్ష



అనుమతుల కోసం రాత్రి 11 గంటల వరకు ఎస్పీ ఆఫీస్‌లోనే ఉన్న కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి

- కాకినాడ సిటీలో పవన్‌కల్యాణ్ పర్యటనకు అధికారుల చిక్కులు
- ప్రచారం చివరి రోజున కాకినాడలో పవన్ రోడ్‌షో, సభకు టీడీపీ, జనసేన దరఖాస్తు
- కానీ అదే రోజు కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి బైక్‌ర్యాలీ ఉందన్న పోలీసులు
- మార్చి ఎనిమిది ప్రాంతాల్లో దరఖాస్తు చేసినా పర్మిషన్ నో
- వైసీపీ ఎమ్మెల్యే అధికార దుర్వినియోగంపై విమర్శలు

మొదటిపేజీ తరువాయి

రాజోలును అభివృద్ధి పథంలో నడిపిస్తా

రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్



రాజోలులో వరప్రసాద్‌కు హారతి ఇస్తున్న మహిళ

రాజోలు, మే 9: రాజోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని రాజోలు, శివకోటి, సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు గాజు గ్లాసు గుర్తుపై, అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీశ్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాజోలు, శివకోటిల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు సమస్యలను ప్రజలు ఆయనదృష్టికి తీసుకొచ్చారు. శివకోటి 18ఎకరాల కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డును చూసి వరప్రసాద్ చలించిపోయారు. ఇంత దారుణమైన రోడ్డుపై ఎలా ప్రయాణం చేస్తున్నారని అడగ్గా నరకం అనుభవిస్తున్నామని కాలనీవాసులు వాపోయారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జగన్ నిర్ణయాలతో వ్యవస్థలన్నీ సర్వనాశనమైపోయాయని ధ్వజమెత్తారు. అనేక ఇబ్బందులకు గురైన ప్రజలంతా జగన్‌ను గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామన్నారు. మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో రోడ్లన్నీ పసుపుమయమయ్యాయి. ప్రచారంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీను, జనసేన మండల శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను, ఎంపీటీసీలు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు, జగడం సత్యనారాయణ, బందెల పద్మ, మోకాపార్వతి, చెల్లింగి శ్రీను, పామర్తి రమణ, రావి మురళి, గుబ్బల కుమార్, కడలి వెంకటరమణారావు, మెరుగుమువ్వల సత్యవరప్రసాద్, కసుకుర్తి త్రినాథస్వామి, కడలి కపిల్, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

మలికిపురం: రాబోయేది కూటమి ప్రభుత్వమేనని డీసీసీబీ మాజీ డైరెక్టర్, చేనేత సంఘ రాష్ట్ర నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావు అన్నారు. మోరి, ఉయ్యూరివారిమెరక, గూడపల్లి, అడివిపాలెం గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



శివకోటిలో సమస్య చెప్తున్న 18 ఎకరాల కాలనీవాసులు



శివకోటిలో చిన్నారులతో కూటమి అభ్యర్థి వరప్రసాద్



మోరిలో ప్రచారం చేస్తున్న చేనేత నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావు

జగన్ పాలనకు చరమగీతం పాడాలి

కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు



ఊబలంకలో బండారుకు హారతి ఇస్తున్న చిన్నారి హర్షిత,



మనుమడు, మనుమరాలితో కలిసి 'ఆంధ్రజ్యోతి' చదువుతూ...

అభ్యర్థితో.. ఒకరోజు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఇక మూడు రోజులు మాత్రమే... దీంతో ప్రచారాన్ని హోరెత్తించారు కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు. ఉదయం ఆరు గంటలకే నిద్రలేచారు. ఏడు గంటలకు మనుమడు, మనుమరాలితో కలిసి 'ఆంధ్రజ్యోతి' పత్రిక చదివారు. 8.30 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. 9 గంటలకు రావులపాలెం మండలం ఊబలంక చేరుకుని టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. 9.45 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంకంపాలెంలో ప్రజాగళం ప్రచారం చేశారు. అనంతరం రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ పెద్దలతో సమీక్షించారు. మధ్యాహ్నం మూడు గంటలకు కుమారుడు సంజీవ్‌తో ఎన్నికల వ్యూహాలపై చర్చిస్తూనే భోజనం చేశారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ర్యాలీలో సుడిగాలి ప్రచారం చేశారు. జగన్ అవినీతి పాలనకు ముగింపు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అభ్యర్థితో ఒకరోజు కార్యక్రమంలో భాగంగా

సీనియర్ నేత బండారు సత్యానందరావుతో 'ఆంధ్రజ్యోతి' ప్రయాణం.... 7లో



కోనసీమ అభివృద్ధి ప్రదాత


జీఎంసీ బాలయోగి

లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి కోనసీమ చరిత్రలో నిలిచేలా చిరస్మరణీయ అభివృద్ధిని అందించారు. ఎన్నో కీలక ప్రాజెక్టుల సాధనకు ఆయన చేసిన కృషి కోనసీమ ప్రజల మదిలో ఇప్పటికీ మెదులుతూనే ఉంది. తీర ప్రాంత మత్స్యకార గ్రామాలను బాహ్య ప్రపంచానికి అనుసంధానం చేసి వారు నిత్యం ఎదుర్కొనే ఎన్నో సమస్యలను పరిష్కరించారు. ఆయన అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరి నోటా ఎప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. అటువంటి స్ఫూర్తి ప్రదాత బాలయోగి లోక్‌సభ స్పీకర్ హోదాలో 2002 మార్చి 3న కృష్ణా జిల్లా కొవ్వాడలంక వద్ద హెలికాప్టర్ కూలిన దుర్ఘటనలో మృత్యువాతపడ్డారు. అయినప్పటికీ ఆయన సాధించిన ప్రాజెక్టులు ఆయన రూపంలో కోనసీమవాసులకు నిత్యం దర్శనమిస్తూనే ఉంటాయి.

● అమలాపురం రూరల్

ఎన్నో పనులు..ఎన్నో ప్రాజెక్టులు

చమురు, సహజ వాయువులు పుష్కలంగా ఉండే కోనసీమలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి వేలాది మందికి ఉపాధి కల్పించారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలతో పాటు ఫ్యాషన్ టెక్నాలజీ ద్వారా కోనసీమ వ్యాప్తంగా వేల మంది మహిళలకు శిక్షణ ఇప్పించారు. తాగునీటి పథకాలను మంజూరు చేయించి ప్రజల దాహార్తి తీర్చారు. ఇలా కోనసీమలో తన ముద్రతో ఉండే ఎన్నో అభివృద్ధి పథకాలను ఆయన ప్రారంభించి ఇక్కడి ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారు. ఆయన మరణానంతరం బాలయోగి ఘాట్, స్టేడియం నిర్మించారు. ఆ చెంతనే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు సంబంధించి ఎన్నో భవనాల నిర్మాణం చేపట్టారు. వాటిలోనే వేలాది మంది మహిళలు, నిరుద్యోగులు, వివిధ రకాల శిక్షణలు పూర్తి చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. అమలాపురంలోని ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాన్ని అప్పట్లో పలు పర్యాయాలు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించి.. వాటి అభివృద్ధి కోసం ఎన్నో చర్యలు తీసుకున్నారు. నేడు ఆ భవన సముదాయమే జిల్లా కేంద్రమైన అమలాపురంలో కలెక్టరేట్‌గా మారింది. ఇక ఆర్డీవో కార్యాలయాన్ని ఢిల్లీలో పార్లమెంటు భవనం తరహాలో నిర్మించిన ఘనత కూడా ఆయనదే.



యానాం-ఎదుర్లంక వంతెన



బాలయోగి హయాంలో కోనసీమ ఎంతో అభివృద్ధి చెందింది. ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, చివరకు లోక్‌సభ స్పీకర్ హోదాలో ఆయన ఈ ప్రాంతాభివృద్ధికి బంగారు బాటలు వేశారు. ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధానంతరం తొలగించబడిన కాకినాడ-కోటిపల్లి రైల్వేలైనును పునరుద్ధరింపజేసి ఈ ప్రాంత ప్రజలకు స్పీకర్ హోదాలోనే అంకితమిచ్చారు. ఆ తర్వాత కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కృషి చేస్తూనే అకాల మృత్యువాతపడ్డారు. ఈ రైల్వేలైన్ ప్రాజెక్టుకు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో కేంద్రం నుంచి సుమారు రూ.వెయ్యి కోట్లను వివిధ దశల్లో విడుదల చేయించారు. అప్పట్లో ఆ నిధులతో గౌతమి గోదావరిపై ముక్తేశ్వరం-కోటిపల్లి మధ్య వారధి నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టారు. ఇప్పటికే అమలాపురం వరకు రైల్వేలైన్‌కు భూసేకరణ పూర్తయినప్పటికీ... ఇక్కడి నుంచి నరసాపురం వరకు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. రైల్వేలైన్ ప్రాజెక్టు విషయంలో వైసీపీ ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నామమాత్రంగానే నిధులు విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేయకపోవడంతో ఒక దశలో పనులు కూడా నిలిచిపోయాయి. ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి.



కామనగరువు నుంచి వెళుతున్న జాతీయ రహదారి

216 హైవేకు బీజం అప్పట్లోనే..

కత్తిపూడి నుంచి నరసాపురం మీదుగా కృష్ణా జిల్లా పామర్రు వరకు వెళ్లే 216 జాతీయ రహదారిని బాలయోగి హయాంలోనే అప్పట్లో కేంద్రం ప్రకటించింది. అయితే ఈ రహదారిని ప్రస్తుతం నాలుగు వరుసల రహదారిగా విస్తరిస్తున్నారు. కత్తిపూడి, కాకినాడ, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు ప్రాంతాల్లో బైపాస్ రహదారుల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. గౌతమి నదిపై ఎదుర్లంక-యానాం మధ్య వారధి నిర్మించిన బాలయోగి ఇక్కడి ప్రజలు పడవ ప్రయాణాలకు స్వస్తి పలికేలా చేశారు.

పోలీసులకు నో ఎంట్రీ





పెద్దాపురం, మే 9: ఏ ఎన్నికలైనా ప్రశాంతగా జరగాలంటే పోలీసులదే కీలక పాత్ర. అభ్యర్థుల ప్రచారాలు, సభలు, ర్యాలీలకు వారి అనుమతులు తప్పనిసరి. పోలింగ్ రోజు ఓటర్లు ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునేలా బందోబస్తు నిర్వహిస్తారు. అయినప్పటికీ పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా సాధ్యమైనంత వరకూ కేంద్రంలో ఎన్నికల అధికారే సిబ్బందితో ఆయా సమస్యను పరిష్కరించుకుంటారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప ప్రత్యేక కారణం లేకుండా పోలీసులు బూత్ లోపలికి పోవడానికి అనుమతి లేదు. పోటీ చేసే అభ్యర్థి అయినా ఇంకా ముఖ్యమైన వ్యక్తి ఓటు వేసేందుకు వచ్చినా వారి భద్రత సిబ్బంది మాత్రం పోలింగ్ కేంద్రం బయటనే ఆగాలి. ఎన్నికల

పోలింగ్ స్టేషన్‌లో ఆర్వోదే అధికారం

విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బంది కలిగించే ఏపని కూడా ముఖ్యమంత్రిగానీ, మంత్రులు కానీ వారి అనుచరులు కానీ చేయకూడదు. పోటీలో ఉన్న అభ్యర్థి జడ్ ప్లస్ కేటగిరీ రక్షణ ఉన్నా వారి వెంట వచ్చే సిబ్బందిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు. మఫ్టీలో ఉన్న భద్రతా సిబ్బంది ఒకరికి మత్రమే అనుమతి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేబినెట్ మంత్రులు, ఉప ముఖ్యమంత్రులకు భద్రతా సిబ్బంది ఉంటారు. వారి కూడా పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లకూడదు. పదవుల్లో ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించకూడదు. ఎలాంటి మాటలు, సైగలు చేసినా నేరంగా పరిగణిస్తారు.. పోలింగ్ సిబ్బంది రాజకీయ నాయకులు, మంత్రుల మాటలు పట్టించుకోకుండా ఎన్నికల సంఘం ఆదేశాలను మాత్రమే అమలు చేయాలి. ఎన్నికల సంఘం అనుమతి పత్రం ఉంటేనే కేంద్రంలోకి అనుమతించాలి.

మాక్ పోలింగ్



పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు

ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్

క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ముందుకు..

పెద్దాపురం, మే 9 : పోలింగ్ రోజు అసలైన పోలింగ్ ప్రారంభం కావడానికి 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్లు వేయడం ద్వారా నోటాతో సహా పోటీలోని ప్రతీ అభ్యర్థికి నమోదైన ఓట్లను నిర్ధారిస్తారు. కంట్రోల్ యూనిట్ ఎలక్ట్రానిక్ ఫలితాలు, వీవీ ప్యాట్ స్లిప్‌ల కౌంట్‌ను ఏజెంట్ల సమక్షంలో లెక్కించి చూపిస్తారు. మాక్ పోలింగ్ విజయవంతంగా నిర్వహించినట్లు సర్టిఫికెట్‌ను ప్రిసైడింగ్ అధికారి రిపోర్టులో పొందుపరుస్తారు. మాక్ పోల్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆ డేటాను క్లియర్ చేసేందుకు కంట్రోల్ యూనిట్ (సీయూ) క్లియర్ బటన్‌ను నొక్కుతారు. మాక్ పోల్ ఓట్లను తొలగించిన తర్వాత సీయూల ఓట్లు నమోదు కాలేదన్న విషయాన్ని అక్కడి పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శించి చూపుతారు. ప్రిసైడింగ్ అధికారి అన్ని మాక్‌పోల్ స్లిప్‌లను వీవీ ప్యాట్ స్లిప్ కంపార్టుమెంట్ నుంచి బయటకు తీసి వాటిని మాక్‌పోల్ స్లిప్ అని స్టాంప్ వేస్తారు. అసలైన పోలింగ్ ప్రారంభానికి ముందు ప్రత్యేకంగా సీలు వేసిన నలుపు కవర్‌లో మాక్‌పోల్ స్లిప్పులను ఉంచి పోలింగ్ ఏజెంట్లకు చూపుతారు. మాక్‌పోల్ తర్వాత ఏజెంట్లు సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లకు సీలు వేస్తారు. అసలు పోల్ ప్రారంభించే ముందు సీళ్లపై పోలింగ్ ఏజెంట్ల సంతకం తీసుకుంటారు.



కుమారుడు కోసం..

80 ఏళ్ల వయసులో కూడా కుమారుడు కోసం నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి సత్యవతి అనపర్తి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం కోరుతూ తమ స్వగ్రామమైన రామవరంలో మండుటెండలో రిక్షాలో తిరుగుతూ తన బిడ్డను గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

● అనపర్తి



తండ్రి కోసం..

ముమ్మిడివరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు చిన్న కుమార్తె కనుమూరి శ్రావ్య, ఆమె భర్త వెంకటసూర్యనారాయణరాజుతో కలిసి ముమ్మిడివరం మండలం లంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సలాదివారిపాలెం, కమిని, పొట్టితిప్ప, వలసల తిప్ప, కొత్తలంక గ్రామాల్లో మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు.

● ముమ్మిడివరం

ఆ డబ్బు ఏమైనట్టు..?

పి.గన్నవరం, మే 9: పి.గన్నవరం మండలంలోని ఓ గ్రామంలో గ్రామ ముఖ్య నేత (వైసీపీ నేత) ఇంట్లో ఓటర్లకు పంచేందుకు పార్టీ పంపిన సొమ్ము మాయం అవడంపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. సుమారుగా రూ.9.50 లక్షలు ఇంటిలో సిద్ధం చేయగా ఈనెల 8న ఉదయం నేత ఇంటికి కారులో ముగ్గురు వ్యక్తులు వచ్చి తాము ఎన్నికల తనిఖీ టీమ్‌గా పరిచయం చేసుకుని సోదాలు అనంతరం ఇంట్లో ఉంచిన రూ.9.50 లక్షలను తీసుకువెళ్లారని చెబుతున్నారు. సదరు నేతను జిల్లా కేంద్రంలోని పోలీసు ఉన్నతాధికారి వద్దకు రావాలని వారి వెంట తీసుకువెళ్లారు. కారు అమలాపురం రూరల్ మండల పరిధిలోని వై.జంక్షన్‌కు వెళ్లగానే వైసీపీ నేతను కేసు కావాలా...డబ్బు కావాలా అని భయపెట్టి అక్కడ వదిలేశారని గత రెండు రోజులుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కాగా అప్పు తెచ్చుకుని ఇంట్లో ఉంచిన సొమ్మును ఎన్నికల అధికారులు పేరుతో భయపెట్టి దొంగిలించుకు పోయారని సంబంధిత వైసీపీ నేత పోలీసులు వద్ద వాపోయినట్లు తెలిసింది. పోలీసులు కూడా ఆ వైసీపీ నేత ఇంటికి వెళ్లి పరిశీలన చేయడంతో పాటు పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను సైతం పరిశీలించినట్లు సమాచారం. అంతే కాకుండా వైసీపీ నేతలే స్వయంగా రంగంలోకి దిగి సీసీ కెమెరాలను పరిశీలన చేసి ఇదంతా చందమామ కథగా ఆపార్టీ నాయకులే అభివర్ణిస్తూ విమర్శలు చేసుకుంటున్నారు. కాగా ఆ వైసీపీ నేత పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని తెలిసింది. ఈ పరిణామంతో ఆ పార్టీ నేతలను అదే పార్టీలో పూర్తిగా నమ్మే స్థితిలో లేరని పలువురు చెప్పుకుంటున్నారు.



గెటప్ శ్రీను ప్రచారం

అంబాజీపేట, మే 9: కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని జనసేన పార్టీ స్టార్ క్యాంపెయినర్ గెటప్ శ్రీను అన్నారు. పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు మద్దతుగా పుల్లేటికుర్రులో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. సినిమా డైలాగులతో ఓటర్లను ఆకట్టుకున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, అవినీతిని ప్రజలకు వివరించారు.



యువత ఆలోచనా విధానం ప్రగతిశీలంగా ఉంది. వారు ఉచిత పథకాలకు ఆకర్షితులవడం లేదు. ఉపాధి కావాలంటున్నారు..ఉద్యోగాలు కావాలంటున్నారు..పరిశ్రమలు నెలకొల్పాల్సిన అవసరం ఉందంటున్నారు. తాత్కాలిక ప్రయోజనాలు కన్నా శాశ్వతంగా తమ బతుకులు బాగుపడాలని కోరుకుంటున్నారు..

వారు ఏమనుకుంటున్నారో వారి మాటల్లోనే..

నిస్వార్థ నాయకుడు కావాలి



నిస్వార్థంగా ప్రజలకు సేవచేసే నాయకుడు కావాలి. ఎటువంటి క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌లేని నాయకుడు అయితే ప్రజలకు చక్కని పరిపాలనందించగలడు. నిరుద్యోగుల సమస్యలు తీరుస్తూ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలి. నేను వేయబోయే మొదటి ఓటును అటువంటి నాయకుడిని ట్యూన్ చేసుకుని వేయాలనుకుంటున్నాను.

ముమ్మితి లతాశ్రీ, కాకినాడ నగరం

మంచి చేసే నాయకుడికే ఓటు



నేను ఓటు నమోదు చేసుకున్న తర్వాత వేయబోయే తొలి ఓటు ఒక ఇంజనీరింగ్ విద్యార్థిగా ప్రస్తుత రాజకీయాలపై నాకు కొంచెం అవగాహన ఉంది. కాబట్టి రాష్ట్రానికి మంచి చేస్తారనుకునే నాయకుడికే ఓటు వేయాలనుకుంటున్నా. గత రాజకీయాలకు ప్రస్తుత రాజకీయాలకు చాలా తేడా కనిపిస్తుంది. ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలకు మంచి చేసే నాయకుడికి మాత్రమే ఓటు వేస్తాను.

దేవారపు రాజేష్, కాకినాడ నగరం

యువతకు అవకాశం ఇవ్వాలి



వారసత్వ రాజకీయాలకు స్వస్తిపలికి యువతకు అవకాశం ఇవ్వాలి. ప్రతి ఒక్కరు నిజాయితీగా ఓటువేయాలి. గ్రామీణ ప్రాంతంలో నాణ్యమైనా విద్య, వైద్యం అందేలా చర్యలు చేపట్టాలి. రైతులకు సాగునీరు అందేలా గ్రామాల్లో చెరువులు తవ్వించాలి. నా తొలి ఓటు విజన్ ఉన్న నాయకుడికే. మంచి నాయకుడే మంచి పరిపాలన అందిస్తాడనే పూర్తి నమ్మకం నాకుంది. అలాంటి నాయకుడినే నేను ఎన్నుకుంటా..

యగదాసు పావని, బలరామపురం, రౌతులపూడి

ఉద్యోగ, ఉపాధి కల్పనకే ఓటు



విద్య, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిని ఎన్నుకోవాలని ఉంది. ఉద్యోగాల కోసం యువత హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆ నగరాలకు దీటుగా మన రాష్ట్రంలోనే ఉద్యోగ, ఉపాధి కల్పన చేసే నేతకు నా తొలి ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. మన రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉంది. ఆ సమస్యను పరిష్కరించే నాయకుడినే ఎన్నుకోవాలి..

- రామకుర్తి చంద్ర సిద్ధార్థ, గొల్లప్రోలు

యువతపై దృష్టి సారించాలి



తొలిసారి ఓటు వేయబోతున్నా. విజయవాడలో బీటెక్ సెకండియర్ చదువుతున్న నేను ఓటు వేసేందుకు వేమగిరి వచ్చాను. ఏ ప్రభుత్వాలైనా యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువతకు ఉద్యోగాలు కల్పించాలి. పరిశ్రమలు రావాలి. అభివృద్ధితోపాటు అన్నివర్గాల ప్రజలకు మేలు జరగాలి. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏ పదవి లేకుండానే రైతుల సంక్షేమంకోసం పాటుపడ్డారు. అలాంటి నాయకులకు నా ప్రాధాన్యం.

సూరపురెడ్డి లిఖితగోపాల్, వేమగిరి, కడియం మండలం

అభివృద్ధికే నా ఓటు



మొదటిసారి ఓటు వేయబోతున్నా. పార్టీలు, కులాలు ముఖ్యం కాదు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుంది. రాష్ట్రాన్ని నిజాయితీగా అభివృద్ధి చేసేవారికే నా ఓటు. యువత దృష్టి అంతా ఉద్యోగాలు, ఉపాధి కల్పన సాధించే నాయకుడు ఎవరనే దానిపై ఉండాలి. ఏ పార్టీ అయినా ఆటువంటి వారికే ఓటు వేయాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

గణేశుల వీరగంగారామ్ ధనుష్, ఇంజనీరింగ్ విద్యార్థి, ముమ్మిడివరం

భవిష్యత్తుకు బాట వేసే నేత కావాలి



నేను తొలిసారి ఓటెయ్యబోతున్నా. యువత కలలను సాకారం చేసేలా పాలకులు ప్రాజెక్టులు, ఉపాధి వనరులు కల్పించాలి. ఉపాధి కల్పనకు ప్రణాళికలు రూపొందించాలి. సంక్షేమం పేరుతో ప్రజలకు డబ్బులు పంచడం సరికాదు. యువశక్తిని వినియోగించుకునేలా భావితరాలకు బంగారుబాట వేసే వారికే నా ఓటు వేస్తాను. యువత అంతా అభివృద్ధికి బాటలు వేసే నాయకుడినే ఎన్నుకోవాలి..

గనిశెట్టి శివభరత్, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

భవిష్యత్తు కోసం ఓటేస్తా



చదువుకున్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది పడుతున్న బాధలను కళ్లారా చూశా. సొంత రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఏ ప్రభుత్వం కల్పించగలదో మాకు తెలుసు. నిరుద్యోగులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తొలిసారి ఓటేస్తా. ఉన్న ప్రాంతంలో ఉద్యోగ కల్పన జరిగితే అన్ని కుటుంబాలు ఆనందంగా ఉంటాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉద్యోగం ఎంత కష్టమో తెలుసు..

పెద్దిరెడ్డి లక్ష్మణేష్, అమలాపురం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలి



నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా కల్పించాలి. తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయి. నేను తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నా. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉద్యోగాలు కల్పించడంతోపాటు అభివృద్ధి, సంక్షేమం అందించే పార్టీకే నా ఓటు. నా దృష్టి భవిష్యత్తుపైనే ఉంది. యువతకు భవిష్యత్తు కల్పించే నాయకుడిపైనే ఉంది.

వాస్కూరి పవన్‌ఈశ్వరుడు, లంకలగన్నవరం, పి.గన్నవరం

యువత నిర్వీర్యమవుతోంది..



లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ కళాశాలల్లో డిగ్రీలు, ఇంజనీరింగ్, బిజినెస్ మేనేజిమెంట్ చదువులు పూర్తిచేస్తున్నా బయటకు వచ్చాక తగిన ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలుకానీ కల్పించే ఆలోచన ప్రభుత్వం చేయకపోవడంతో యువత నిర్వీర్యమైంది. డిగ్రీల పట్టాలు చేతబట్టి ఏళ్లు గడుస్తున్నా కనుచూపుమేరలో యువత ఆశలు ఫలించే అవకాశాలు లేవు. ఇది ముమ్మాటికీ పాలకప్రభుత్వాల వైఫల్యమే. రానున్న ప్రభుత్వాలు ఈ విషయంలో సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి

యరజర్ల విజయకుమార్, ప్రైవేట్ ఉద్యోగి, వేట్లపాలెం, సామర్లకోట మండలం

కార్పొరేషన్(కాకినాడ)/ రౌతులపూడి/ గొల్లప్రోలు/ ముమ్మిడివరం/ ఉప్పలగుప్తం/అమలాపురం/పిగన్నవరం/సామర్లకోట

రేపటి నుంచి వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఐ.పోలవరం, మే 9: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి ఈనెల 15 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. శైవాగమ పండితుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అభిషేకం, స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులను చేయడం, సాయంత్రం భద్ర పీఠంపై ఊరేగింపు ఉంటాయన్నారు. 12న చంద్రప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు, ఎదురు సన్నాహం, ద్వాదశ ప్రదక్షిణ అనంతరం కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. మూడో రోజు సరస్వతీ హోమం, సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు, నాలుగో రోజు విశేష అభిషేకం, చండీహోమం, కళాహోమాలు, నంది వాహనంపై ఊరేగింపు, సదస్యం, పండిత సత్కారం ఉంటాయన్నారు. చివరి రోజు పూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూల స్నానం, రథోత్సవం, పుష్పోత్సవం, పవళింపు సేవ కార్యక్రమాలుంటాయన్నారు. ఏర్పాట్లలో భాగంగా ఆలయ ఆవరణ మొత్తం చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

చెట్లు నరికేస్తున్నారు!

● సీఎం రాకతో నరికివేత ● పిల్లల ఆట స్థలంలో హెలిపాడ్‌పై విమర్శలు


డివైడర్‌పై చెట్లను నరికేసిన దృశ్యం

పిఠాపురం, మే 9: జగన్ వస్తున్నారంటే అంతా విధ్వంసమే. సారు రాక కోసం అప్పుడే చెట్ల నరికివేత ప్రారంభమయింది. పట్టణంలో ఉన్న ఒక క్రీడా మైదానంలో హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు అక్కడ పిల్లలు ఆడుకునే అవకాశం లేకుండా చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ ఈ నెల 11వ తేదీన పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. ఆ రోజున ఉప్పాడ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అంబేడ్కర్ సెంటర్ నుంచి పాతబస్టాండు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకూ గల డివైడర్‌పై ఉన్న చెట్ల కొమ్మలను గురువారం మధ్యాహ్నం నరికివేశారు. వాటిని తొలగించి అక్కడ నుంచి తరలించారు. ఉప్పాడ సెంటర్‌లో పలు చెట్ల కొమ్మలు తొలగించారు. ఇప్పుడు జగన్ రాక కోసం పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో హెలిపాడ్ నిర్మించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు ఆడుకునేందుకు ఇదొక్కటే క్రీడా మైదానం ఉంది. ఇప్పుడు ఈ మైదానంలో కాంక్రీటుతో హెలిపాడ్ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం వలన భవిష్యత్తులో ఇక్కడ క్రీడలు ఆడుకునే అవకాశాన్ని విద్యార్థులు, క్రీడాకారులు కోల్పోనున్నారు. జగన్ హెలిపాడ్ కోసం క్రీడా మైదానాన్ని పనికి రాకుండా చేయడం ఏమిటని క్రీడాభిమానులు ప్రశ్నిస్తున్నారు.

లక్ష ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు

ప్రముఖ సినీ హీరో శివాజీ



సమావేశంలో మాట్లాడుతున్న హీరో శివాజీ

కొవ్వూరు, మే 9: ఎన్‌ఆర్‌ఐ టీడీపీ ఆధ్వర్యంలో వెస్టర్న్ దేశాల్లో లక్ష ఉద్యోగాలు అందించనున్నట్టు సినీ హీరో శివాజీ చెప్పారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వ ర్యంలో గురువారం రాత్రి కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ లక్ష ఉద్యోగాలు కల్పనే లక్ష్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ విదేశాల్లో తాము కల్పించేవి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కావని, ఉపాధ్యాయ, వ్యవసాయ రంగంలో ఉద్యోగాలన్నారు. అక్కడికి వెళ్లేవారికి భాషకు ఇబ్బంది లేకుండా ఎన్‌ఆర్‌ఐ టీడీపీ ఆధ్వర్యంలో 4 నెలలు శిక్షణ అందిస్తామన్నారు. ఏపీలో జాబ్ క్యాలెండర్ మర్చిపోతున్న తరుణంలో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగాలు కల్పన కార్యక్రమానికి తాను వలంటీరుగా వచ్చానన్నారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు ఎన్‌ఆర్‌ఐ టీడీపీ డాట్‌కామ్ స్లాష్ ఇంటర్నేషనల్ జాబ్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కొంతమంది ఎన్‌ఆర్‌ఐలు సమూహంగా ఏర్పడి లక్ష ఉద్యోగాలు కల్పిస్తుంటే ప్రభుత్వం ఇంకెంత చేయాలన్నారు. ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద నిలబెట్టిన ఘనుడు జగన్‌రెడ్డికి ఉద్యోగం విలువ ఏం తెలుసన్నారు. హైదరాబాద్‌లో కూర్చుని కొంతమంది డిబేట్‌లు, ఇంటర్వ్యూల పేరుతో ఏపీపై విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్ కబ్జా చేశారని, లాండ్ టైటిలింగ్ చట్టం దుర్మార్గమన్నారు. వైజాగ్‌లో అపరిమిత సంపద ఉందని, అందుకే మాట్లాడితే వైజాగ్ వెళ్లిపోతానంటున్నార అన్నారు. మే 13వ తేదీతో జగన్మోహనరెడ్డి ఖాళీ అయిపోతారని, ఇకనైనా సీబీఐ కేసులపై విచారణ చేపట్టాలని న్యాయమూర్తులను దేశ పౌరుడిగా కోరుతున్నానన్నారు. మే 13 తర్వాత జగన్ లండన్ వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కుమారుడు హితేష్ మాట్లాడుతూ కొత్త పరిశ్రమలు రాలేదని, ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయని, జాబ్ క్యాలెండర్ లేదని అన్నారు. సీబీఎన్ ఫోరం సభ్యురాలు పాతూరి సునీత మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి యువతను అన్నివిధాల మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నారని, ఏదీ అమలు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు చదువు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించడం లేదన్నారు. దీంతో హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో చాలీచాలని జీతాలతో వైట్ కాలర్స్‌గా యువత పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సభ్యులు ఎం.అనీల్, సతీష్, వేమూరి అరవింద్, మీడియా కోఆర్డినేటర్ దొడ్డపనేని సాగర్, సూరపనేని చిన్న, బీవీ ముత్యాలరావు, దాయన రామకృష్ణ, మద్దిపట్ల సురేష్ పాల్గొన్నారు.

అభ్యర్థితో.. ఒకరోజు


మనుమడు సత్యాన్ష్‌తో కలిసి గణనాథునికి పూజ, కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం...

జగన్ పాలనకు
చరమగీతం పాడాల్సిందే

ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం
ప్రజలతో మమేకమవుతూ ప్రచారంలో దూసుకుపోతూ...
కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావుతో ఒక రోజు

రాష్ట్రంలో ఐదేళ్లు సాగిన రాక్షస పాలనకు చరమ గీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి (టీడీపీ) అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. గురువారం బండారు సత్యానందరావుతో 'ఆంధ్రజ్యోతి' ఒకరోజు ప్రయాణం సాగించింది. రెండు నెలల నుంచీ విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ఉదయం ఆరు నుంచి రాత్రి ఏడు గంటల వరకు అనుక్షణం ఓటర్లను కలుస్తున్నారు. కూటమి నేతలతో సమీక్షించడం... కుల సంఘాల ప్రతినిధులను కలిసి మద్దతు కోరడం.... రాజకీయ వ్యూహాలను రచిస్తూ బిజీబిజీగా గడపడాన్ని 'ఆంధ్రజ్యోతి' గుర్తించింది.

● ఆత్రేయపురం


రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో తనయుడు సంజీవ్‌తో మాట్లాడుతూ భోజనం చేస్తున్న బండారు

బిజీ షెడ్యూల్

ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు ప్రచారంలో ప్రజలతో మమేకమయ్యారు. రావులపాలెంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అంకంపాలెం, ర్యాలి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జగన్ అవినీతి పాలనకు ప్రజలు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. ఎంతో సమర్థుడైన చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఓటర్లకు వివరించారు. ఆయనపై యువకులు పూల వర్షం కురిపించారు. వందల సంఖ్యలో యువకులు మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. ప్రచారంలో అధికార పార్టీ అరాచకాలను ఎండగట్టారు. కూటమి మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.

ఒకవైపు ప్రచారం... మరోవైపు వ్యూహరచన


ఊబలంకలో కూటమి ముఖ్య నేతలతో కరచాలనం

ఉదయం 6.30 గంటలకు నిద్ర లేచి వ్యాయామం చేశారు. ఏడు గంటలకు స్నానం ఆచరించారు. 8 గంటలకు ఇంట్లోని వినాయకుడికి మనుమడు సత్యాన్ష్‌తో కలిసి పూజ చేశారు. మనుమడు, మనుమరాలితో కలిసి 'ఆంధ్రజ్యోతి' పత్రిక చదివారు. 8.30 గంటలకు భార్య కమలారాణి, పెద్ద కుమారుడు సందీప్, కోడలు సునీత, కుమార్తె రమ్యశ్రీ, మనమడు సత్యాన్ష్, మనుమరాలు మిషికాతో కలిసి అల్పాహారం స్వీకరించారు. 9 గంటలకు వాడపాలెంలో బయల్దేరి రావులపాలెం మండలం ఊబలంక చేరుకుని టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. 9.45 గంటలకు అంకంపాలెం చేరుకుని మధ్యాహ్నం 1.30 వరకు ప్రజాగళం ప్రచారం చేశారు.
2 నుంచి 4 గంటల వరకు రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ పెద్దలతో సమీక్షించారు. మధ్యాహ్నం మూడు గంటలకు రెండవ కుమారుడు సంజీవ్‌తో కలిసి భోజనం చేశారు. ఇద్దరూ ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. 4.30 గంటలకు ఆత్రేయపురం మండలం ర్యాలి బయల్దేరారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు సుడిగాలి ప్రచారం చేశారు. పది గంటల పార్టీ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. కారులోనే పండ్లు తిని గ్రీన్‌టీ తాగారు.

రూ.2,100 కోట్లతో కొత్తపేటను అభివృద్ధి చేశాను


ప్రచార రథంపై బండారు (పైన) కారులో గ్రీన్‌టీ తాగుతూ పార్టీ నేతలతో మాట్లాడుతూ...

మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా కుల, మత, వర్గ విభేదాలకు తావులేకుండా సామరస్య పాలన అందించాను. నా హయాంలో సుమారు రూ.2,100 కోట్లతో అభివృద్ధి పనులు చేసి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నిలిపాను. సీసీ రోడ్లు, డ్రైనేజీ, గ్రోయిన్లు, తాగునీటితో పాటు ఇరిగేషన్ మోడరైజేషన్ పనులు చేపట్టాం. మహిళలు, బీసీల అభ్యున్నతికి పాటుపడ్డాను. వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి బాటలు వేశాను. ఈసారి ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గ అభివృద్ధికి పటిష్ఠ ప్రణాళిక రూపొందించి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాను.


అంకంపాలెం ప్రచారంలో కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావుతో మహిళ సెల్ఫీ

నేడు పవన్ కల్యాణ్ రోడ్‌షో

మూడు చోట్ల స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్..ఉప్పాడలో బహిరంగ సభ

పిఠాపురం/పిఠాపురం రూరల్/కొత్తపల్లి, మే 9: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. మూడు చోట్ల స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌ల్లో పవన్ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో గురువారం జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, పిఠాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు వెల్లడించారు. 10వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పిఠాపురం మండలం చిత్రాడలో పవన్ రోడ్‌షో ప్రారంభమవుతుంది. అనంతరం 216వ జాతీయ రహదారి మీదుగా పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం పక్క నుంచి జగ్గయ్యచెరువు కాలనీలోకి వెళ్లి అక్కడ రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్లు, సామర్లకోట రోడ్డు, పాదగయ, తహసీల్దారు కార్యాలయం సెంటర్ మీదుగా పాతబస్టాండు, ఉప్పాడ బస్టాండు సెంటర్‌కు చేరుకుని అక్కడ జరిగే స్ట్రీట్‌కార్నర్ సమావేశంలో మాట్లాడతారు. అనంతరం కోట గుమ్మం, మార్కెట్, చర్చిసెంటర్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, అగ్రహారం, పశువుల సంత మీదుగా రోడ్‌షో కొనసాగి గొల్లప్రోలు పట్టణంలోకి ప్రవేశిస్తుంది. గొల్లప్రోలులోని మెయిన్‌రోడ్డు, పాతబస్టాండు, రాయవరం సెంటర్, రామాలయం, పల్లపువీధి, ఎంపీడీవో కార్యాలయం, ఈబీసీ కాలనీ మీదుగా రోడ్‌షో ఉంటుంది. అక్కడ జరిగే సమావేశంలో పవన్ ప్రసగించనున్నారు. గొల్లప్రోలు, చేబ్రోలులో రోడ్‌షో అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు విరామం తీసుకుంటారు. తిరిగి సాయంత్రం 4గంటలకు చేబ్రోలు నివాసం నుంచి పవన్ బయలుదేరి ఏకే, ఏపీ మల్లవరం గ్రామాల మీదుగా రమణక్కపేట, కోనపాపపేట, మూలపేట, అమీనాబాదు గ్రామాల మీదుగా ఉప్పాడ చేరుకుంటారు. అక్కడ రాత్రి ఏడు గంటలకు జరిగే బహిరంగ సభలో ప్రసంగించి కొత్తపల్లి, యండపల్లి, కొండెవరం, నవఖండ్రవాడ గ్రామాల మీదుగా మరలా రాత్రి పది గంటల సమయానికి పిఠాపురం చేరుకుంటారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ విజయం ఇప్పటికే ఖరారయిందని, మెజార్టీపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉందని తెలిపారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా పవన్ గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు తోలేటి శిరీష, పిల్లా శివశంకర్, జ్యోతుల సతీష్ పాల్గొన్నారు.

ట్రైనీ ఐపీఎస్‌లతో కలెక్టర్ భేటీ


ట్రైనీ ఐపీఎస్‌లతో కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ అత్యంత కీలకమని ట్రైనీ ఐపీఎస్‌లతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత అన్నారు. ఎన్నికల నిమిత్తం జిల్లాకు వచ్చిన ట్రైనీ ఐపీఎస్‌లు ఎస్పీ జగదీశ్‌తో కలిసి కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల యంత్రాంగం, పోలీసు బందోబస్తు మధ్య సమన్వయం సాధించడం ముఖ్యమన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వ హించడానికి ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గనిర్దేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. వివిధ నియోజకవర్గాల్లో వారికి బాధ్యతలు కేటాయిస్తామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.

రూ.1,19,78,926 నగదు సీజ్

అమలాపురం టౌన్, మే 9: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఈ నెల 8వ తేదీ వరకు ఆధారాలు చూపని రూ.1,19,78,926 నగదు సీజ్ చేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పరిమితమైన నగదు రవాణాకు సంబంధించి ఆధారాలు చూపించిన వారి నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేశామన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు సాధారణ ఎన్నికల ప్రచార గడువు ముగుస్తుందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో ఓటర్లు కాకుండా జిల్లా నివాసి కానివారు స్థానికంగా లాడ్జీలు, హోటళ్లలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు తాత్కాలిక వసతి, నివాసాలు ఉండరాదని స్పష్టం చేశారు. ఎవరికి వారు వారి సొంత జిల్లాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. బయట జిల్లాల వారు బస చేయకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు.

రూ.3లక్షలు విలువైన మందులు స్వాధీనం

అమలాపురం టౌన్, మే 9: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డులోని శ్రీలక్ష్మి చర్మవ్యాధుల ఆసుపత్రిలో ఔషధ తనిఖీ అధికారి కేవీ భూపేష్ ఆధ్వర్యంలో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి లైసెన్సులు లేకుండా ఆసుపత్రిలో మందులు విక్రయిస్తున్నారన్న సమాచారంతో రాజమహేంద్రవరం ఔషధ తనిఖీ అధికారి ఎ.కృష్ణ, సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. సుమారు రూ.3లక్షలు విలువైన మందులను డాక్టర్ ప్రసాద్ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామని వాటిని కోర్టుకు పంపిస్తామని భూపేష్ చెప్పారు.



అమలాపురం రూరల్ పేరూరు శివారు కొంకాపల్లిలో అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి హరీష్‌మాధుర్, చెరుకూరి సాయిరామ్‌లను సన్మానిస్తున్న స్థానికులు, ఐ.పోలవరం మండలం ఎదుర్లంకలో ఇంటింటా ప్రచారంలో చిన్నారితో హరీష్

యువత భవిష్యత్తుకు కూటమి గ్యారంటీ

అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 9: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, యువత భవిష్యత్తుకు కూటమి గ్యారంటీ ఇస్తుందన్నారు. మెగా డీఎస్సీతో పాటు పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రామచంద్రపురం మండలం కోటిపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, రేవు శ్రీనులతో కలిసి హరీష్‌మాధుర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పలు ప్రాంతాల్లో యువకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కొద్దిసేపు రోడ్‌షో నిర్వహించారు. అభ్యర్థులతో కలిసి ఫొటోలు తీయించుకునేందుకు స్థానికులు ఎగబడ్డారు. ప్రచారంలో పెమ్మాడి బేబి, సత్తిబాబు, తమ్మా చిన్నా, సీరెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు.

ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్లరేవు మండలం కోరంగి, చొల్లంగి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల సుబ్బరాజుతో కలిసి హరీష్‌మాధుర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. లచ్చిపాలెం, చొల్లంగిపేట తదితర ప్రాంతాల్లో మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. కొందరు మహిళలైతే విజయీభవ అంటూ ఆశీర్వదించారు. ప్రచారంలో పెమ్మాడి కృష్ణవేణి, వాడ్రేవు వీరబాబు, వైదాడి శ్రీనివాసరావు, కట్టా త్రిమూర్తులు, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి అనంతలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఐ.పోలవరం మండలం ఎదుర్లంకలో ఎంపీటీసీ రెడ్డి మాధురి తదితరులు టీడీపీలో చేరగా హరీష్‌మాధుర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక పథకాలను అమలు చేయనున్నట్టు వివరించారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు రుణ పరిమితిని రూ.10లక్షల వరకు పెంచుతామన్నారు. మత్స్యకారులతో పాటు ఇతర కులవృత్తుల్లో ఉన్నవారికి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు. హరీష్‌మాధుర్ విజయాన్ని కోరుతూ ఆయన సోదరీమణులు దీప్తి, రమ్య, కీర్తి పలు నియోజకవర్గాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. నమూనా ఈవీఎం చూపిస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. పలుచోట్ల వారికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. కొంకాపల్లిలో చెరుకూరి సాయిరామ్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. స్థానిక పెద్దలతో కలిసి హరీష్‌మాధుర్, సాయిరామ్‌లను గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, ఎంపీటీసీ పనసా బుజ్జి, తిక్కా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


నమూనా ఈవీఎంలో హరీష్‌మాధుర్ పేరు చూపించి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఆయన సోదరీమణులు

'ఓటు హక్కుతో రాక్షస పాలనకు ముగింపు పలకాలి'


హరీష్‌మాధుర్, సుభాష్‌లకు సత్కారం

ద్రాక్షారామ, మే 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కుతో రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు దళితులు ముగింపు పలకాలని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం సాయిమాధవానంద కల్యాణ మండపంలో నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశంలో వాసంశెట్టి సుభాష్ మాట్లాడారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరు పెట్టినప్పుడు తాను వ్యతిరేకించినట్లు విష ప్రచారం చేస్తున్నారని అంబేడ్కర్ జిల్లాగా పేరు పెట్టడానికి తొలిసారిగా తాను మద్దతు ఇచ్చానని ప్రకటించారు. లాంగ్‌మార్చ్ పెట్టినప్పుడు తన సామాజికవర్గంతో బలప్రదర్శన కూడా చేశానన్నారు. తాను బీసీగా రిజర్వేషన్లు అనుభవిస్తున్నామంటే అంబేడ్కర్ పెట్టిన భిక్షేనని ఆనాడే ప్రకటించానన్నారు. అమలాపురం అల్లర్లలో ఒక్కశాతం కూడా తన ప్రమేయం ఏమాత్రం లేదని తనపిల్లలు, తాను నమ్మిన ద్రాక్షారామ భీమేశ్వరుని సాక్షిగా చెబుతున్నానన్నారు. మంత్రి విశ్వరూప్ విజయానికి కోట్లు ఖర్చు చేశానని చెప్పారు. కారు కొని ఇచ్చానన్నారు. తన తల్లికి పదవి ఇస్తానని రూ.2 కోట్లు విశ్వరూప్ తీసుకున్నారని ఆరోపించారు. దళితుడిని చంపిన ఎమ్మెల్సీ అనంతబాబును నెత్తిన పెట్టుకున్న పార్టీ 27 దళితుల పథకాలు ఎత్తివేసిన పార్టీ అయిన వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ దళిత వ్యతిరేక వైసీపి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు టీడీపీకి వేసి గెలిపించాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థి కాటే సుబ్రహ్మణ్యం టీడీపీ అభ్యర్థి సుభాష్‌కు మద్దతు ప్రకటించారు. టీడీపీ దళిత నాయకులు రవ్వా భూషణం, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, జనసేన నాయకుడు బుంగరాజు పాల్గొన్నారు.

జిల్లాలో 991 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్: కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్, మే 9: జిల్లాలోని 991 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఆయా కేంద్రాలను కలెక్టరేట్‌కు అనుసంధానించి వీక్షించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. జిల్లాలో 563 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి అదనంగా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న మరో 428 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరిండెంటెంట్ టి.వైద్యనాథశర్మ, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ నెల 13న పోలింగ్ సజావుగా జరిగేలా పక్కా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్‌కు 48 గంటల ముందు సైలెంట్ పీరియడ్‌గా నిర్ధారించామన్నారు. డబ్బు, మద్యం పంపిణీ ప్రయత్నాలను కట్టుదిట్టంగా నియంత్రించేందుకు మోడల్ కోడ్ బృందాలతో నిఘా ఉంచామన్నారు. ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 1,644 పోలింగ్ కేంద్రాలకు 563 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు సింగిల్ బ్యాలెట్ యూనిట్‌తోనే పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. సాధారణ ఎన్నికల్లో సంఘ వ్యతిరేక శక్తుల జోక్యాన్ని అరికట్టేందుకు ఈ నెల 11వ తేదీ నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 13న పోలింగ్ ప్రక్రియలో భాగంగా సెక్షన్ 144, సీఆర్పీసీ కింద ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండకుండా నిషేధాజ్ఞలు అమలు చేస్తామన్నారు. పోలింగ్ ముగిసే ముందు 48 గంటలలోపు బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచారాలు నిషేధించామన్నారు. 13వ తేదీ సోమవారం దుకాణాలు, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సెలవు దినంగా ప్రకటిస్తూ కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు సహాయ సంచాలకురాలు టి.నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉండి పక్కనే ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాంలో పనిచేస్తున్న కార్మికులకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని యాజమాన్యాలకు సూచించామన్నారు.

'ఓటమి భయంతో దేశం విడిచి వెళ్లేందుకు జగన్ యత్నాలు'

రాజోలు, మే 9: ఎన్నికల్లో ఓటమి భయంతో సీఎం జగన్ దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారని టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు ఆరోపించారు. రాజోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ దేశం విడిచి పోకుండా సీబీఐ, ఈడీ చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవవరప్రసాద్‌తో కలిసి గురువారం రాజోలు, శివకోటి గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోల్లో సతీష్‌బాబు పాల్గొన్నారు.

క్రిటికల్ పోలింగ్ కేంద్రం పరిశీలన



అమలాపురం టౌన్, మే 9: కొత్తపేట మండలం పలివెలలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాన్ని పోలీసు పరిశీలకుడు ఎంపీ చంద్రకాంత్ గురువారం పరిశీలించి స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా రాయవరం పోలీసు స్టేషను పరిధిలో ముందుగా అందిన సమాచారంతో కారు షెడ్డును తనిఖీ చేయగా రూ.96వేలు విలువైన 762 ఎన్డీపీ లిక్కర్ బాటిళ్లు, 137.16 లీటర్ల ఐఎంఎల్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. విస్తృత దాడుల్లో భాగంగా పదకొండు మందిని అరెస్టు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు.

కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి: సుభాష్



కోటిపల్లిలో ప్రచార రథంలో సుభాష్ తదితరులు



కోటిపల్లిలో సుభాష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కె.గంగవరం, మే9: కూటమిప్రభుత్వం అధికారంలోకి వస్తే సమాజంలోని అన్నివర్గాలు అభివృద్ధి చెందుతాయని రామచంద్రపురం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం కోటిపల్లి, కోట గ్రామాల్లో ఆయన ఎంపీ అభ్యర్థి హరీష్‌తో కలసి ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు వివరించి ఓట్లు అభ్యర్థించారు. కోటిపల్లిలో సుభాష్ ప్రచారానికి విశేష స్పందన వచ్చింది. మహిళలు హారతులిచ్చారు. పార్టీ నాయకులు రేవు శ్రీను, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీనాయకుడు యాళ్ల దొరబాబు, సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, తమ్మా చిన్న, శీరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ఘటనపై కేసు నమోదు

రాయవరం, మే9:రాయవరంలో ఒకఇంటి కారు షెడ్డులో నిల్వఉంచిన 180ఎంఎల్ 672 బాటిళ్లను బుధవారం స్వాధీనం చేసుకున్న ఘటనలో ఇంటి యజమానిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ జి.సురేష్ గురువారం తెలిపారు. ఈమద్యం వైసీపీ సానుభూతిపరుడిదిగా ప్రజలు భావిస్తున్నారు.

ధాన్యం రాశులు దగ్ధం

ఆత్రేయపురం, మే 9: తాడిపూడికి చెందిన ముదునూరి లచ్చిరాజుపొలం కల్లాల్లోని రూ.75వేలు విలువైన 50బస్తాలధాన్యం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తి

కొత్తపేట, మే 9: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ గురువారం సాయంత్రం ముగిసిందని ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. 1,794మందికి 1,745 మంది ఓటు వేశారు. బ్యాలెట్ బాక్సులకు స్ట్రాంగ్‌రూమ్స్‌కు తరలించారు.

బోల్తా పడిన మిల్క్ వ్యాన్

ఆలమూరు, మే 9: పామర్రు నుంచి అమలాపురం వెళ్తున్న పాల వ్యాన్ పెదపళ్ల వద్ద గురువారం బోల్తా పడింది. కొత్తూరు-వెదురుమూడి రోడ్డు అధ్వానంగా ఉండడంతో అదుపుతప్పి బోల్తా పడిందని స్థానికులు చెప్పారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం, క్యాషియర్ శ్రీధర్‌లకు గాయాలయ్యాయి.

బండారుకు మద్దతుగా మహిళల ప్రచారం



ఆలమూరులో టీడీపీలో చేరిన గ్రామ వలంటీర్లు

ఆలమూరు, మే 9: కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావుకు మద్దతుగా గుమ్మిలేరులో మహిళలు భారీ సంఖ్యలో గురువారం చేసిన ప్రచారం ఆకట్టుకుంది. ఇంటింటికీ తిరిగి కూటమి మేనిఫెస్టోలోని అంశాలతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు ఇచ్చి ఈనెల13న జరిగే పోలింగ్‌లో బండారుకు సైకిల్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

టీడీపీలో చేరిన గ్రామవలంటీర్లు

ఆలమూరు, మే9: ఆలమూరుకు చెందిన నలుగురు వలంటీర్లు టీడీపీ నేత వంటిపల్లి పాపారావు సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ ఏరుకొండ రామకృష్ణతో పాటు గణేష్ కాలనీకి చెందిన పలువురు నాయకులు డీపీ రావు అధ్వర్యంలో పాపారావు సమక్షంలో పార్టీలో చేశారు. జొన్నాడ మాజీ ఎంపీటీసీ దివంగత కొమలి దుర్గ కుటుంబ సభ్యులు వైసీపీకి రాజీనామా చేసి కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు సమక్షంలో టీడీపీలో చేరారు.

బండారు గెలుపు కోరుతూ ఎమ్మార్పీఎస్ ప్రచారం

రావులపాలెం, మే9: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు గెలుపు కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ముమ్మిడివరప్పాడులో ప్రచారం నిర్వహించారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను అత్యధిక మెజార్టీ గెలిపించాలని కోరారు. ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు క్రాప నాగరాజు, సీనియర్ నాయకులు లంక కుమారి, యర్లగడ్డ మమ్ము, కొడమంచిలి చిరంజీవి, కముజు శ్రీను, పిప్పర సత్యానందబాలాజీ, అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు చేరిక

ఉప్పలగుప్తం, మే 9: వచ్చే ఎన్నికల్లో కూటమికే తాము ఓటేస్తామని ఎస్.కొత్తపల్లి మార్కెట్ ఏరియా, రామాలయం ప్రాంతానికి చెందిన పలువురు ప్రతిజ్ఞ చేశారు. వైసీపీ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు కుచ్చర్లపాటి పెద్దిరాజు, కడియం సందీప్, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జనసేన, టీడీపీల్లో చేరారు. అయితాబత్తుల కరణ్, మెట్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి సర్పంచ్ రామారావు రాజీనామా

పి.గన్నవరం, మే 9: గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని మొండెపులంక సర్పంచ్ గుడాల రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన వైసీపీకి రాజీనామ చేసినట్టు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. పంచాయతీలు అభివృద్ధిలేక దీనస్థితిలో ఉన్నాయన్నారు.

సెంటాక్ ద్వారా కోర్సులకు ఆహ్వానం

యానాం, మే 9: పుదుచ్చేరిలోని వివిధ కళాశాలల్లో ప్రొఫెషనల్ కోర్సులకు సెంటాక్ (సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి బీటెక్, బీఆర్క్, బీఎస్సీ, బీపీటీ, అగ్రికల్చర్ తదితర పారామెడికల్ కోర్సులు, ఆర్ట్స్, సైన్సు కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 22తేదీలోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: వేగుళ్ల







రాయవరం: కురకాళ్లపల్లిలో కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ప్రచారం, కురకాళ్లపల్లిలో వేగుళ్లను సత్కరిస్తున్న గ్రామస్థులు, మండపేట పట్టణంలో వేగుళ్ల కుమార్తె ప్రచారం

మండపేట కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు





వేగుళ్ల కుమార్తెకు హారతి ఇస్తున్న దృశ్యం, వేగుళ్ల అల్లుడు చిన్న అల్లుడు సాయికుమార్‌బాబు, సోదరుడి కుమారుడు అజయ్‌బాబు ప్రచారం

రాయవరం, మే9: ప్రజల కష్టాలు తీరాలన్న, రాష్ట్రం అభి వృద్ధి చెందాలన్నా చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వం రాష్ట్రానికి అవసరమని కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం కురకాళ్లపల్లిలో వేగుళ్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వేగుళ్ల మాట్లాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించాలన్నా, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలన్నా ప్రజలంతా కూటమికి ఘనవిజయం అందించాలన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి కుంటుపడిందని, కనీస సౌకర్యాలు కూడా గ్రామాల్లో కల్పించలేదన్నారు.రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడి డబుల్ ఇంజన్ సర్కారు అధికారంలోకి వచ్చేందుకు పోరాటం చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో మూడు పార్టీలు చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. గ్రామంలో వేగుళ్ల ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా హరీష్‌మాదుర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామంలో పర్యటించిన వేగుళ్లకు మహిళలు హారతులు పట్టగా, ప్రజలు పూలమాలలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. వేగుళ్ల వెంట టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లాఅండ్ ఆర్డర్ అట్టర్ ప్లాప్

మండపేట, మే 9: రాష్ట్రంలో లాఅండ్ ఆర్డర్ అట్టర్ ప్లాప్ అయిందని, ప్రజలకు మంచిచేయాలన్న ఆలోచనను వైసీపీ నాయకులు మరచిపోయారని కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు కుమార్తె మణిమంజరి ఆరోపించారు. స్థానిక 13,14వార్డుల్లో గురువారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఆమె వార్డుల్లో ప్రతీ ఇంటికి వెళ్లి కూటమి మేనిఫెస్టోను వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో తన తండ్రి వేగుళ్లను, ఎంపీగా గంటి హరీష్‌మాధర్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓట ర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లా డుతూ గత టీడీపీ హయాంలో చంద్ర బాబు రాష్ట్రానికి పరి శ్రమలు, ప్రాజెక్టులను తీసుకువచ్చా రన్నారు. వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని ఆపేసి, టీడీపీ శ్రమను అంతా వృథా చేసిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యక ర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోరుతూ ఆయన చిన్న అల్లుడు సాయికుమార్‌బాబు, సోదరుడి కుమారుడు అజయ్‌బాబు మండపేట పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమికి ఓటు వేయడం ద్వారా అభివృద్ధికి నాంది పలికిన ట్టేనని కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు సోదరుడి కుమార్తె ఎం.మణిమంజరి అన్నారు. స్థానిక 7,8వార్డుల్లో తన తండ్రి వేగుళ్లకు మద్దతుగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టో పేదల సంక్షేమానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని, అలా చేయ కపోతే ఓట్లు అడటానికి రానని చెప్పి గద్దెనెక్కిన జగన్, వైసీపీ నాయకులు ఏమోహం పెట్టుకుని ఇప్పుడు ఓట్లు అడుగు తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

వేట నష్టపరిహారాన్ని పెంచేందుకు కృషి చేస్తా







తాళ్లరేవు మండలం పెదబొడ్డు, చినబొడ్డువెంకటాయపాలెం, చొల్లంగి, లచ్చిపాలెం గ్రామాల్లో కూటమి అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్‌మాధుర్ ప్రచారం దృశ్యాలు

ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు





తాళ్లరేవు: దాట్ల బుచ్చిబాబు, హరీష్‌మాధుర్ ప్రచారం, ముమ్మిడివరం: 17వ వార్డులో టీడీపీ నాయకుల ప్రచారం

తాళ్లరేవు, మే 9: గ్యాస్ కంపెనీలు సముద్రంలో పైపులైను పనులు చేసే సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నష్టపరిహారాన్ని పెంచేందుకు కృషిచేస్తానని ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. గురువారం కోరింగ పంచాయతీ పెదబొడ్డు, చినబొడ్డువెంకటాయపాలెం, చొల్లంగి, లచ్చిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నేతలు వాడ్రేవు వీరబాబు, వైదాడి శ్రీనివాసరావు, పెమ్మాడి కృష్ణవేణి ఆధ్వర్యంలో దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లకు ప్రజలు పూలనీరాజనాలతో స్వాగతం పలికారు. బుచ్చిబాబు మాట్లాడుతూ మీఅందరి భవిష్యత్‌లు బాగుండాలంటే చం ద్రబాబును సీఎంగా మళ్లీరప్పించాలన్నారు. హరీష్‌మాధుర్ మాట్లాడుతూ అమలాపురం పార్లమెంటు పరిధిలో కుంటిపడిన అభివృద్ధిని పునరుద్ధరించి జీఎంసీ బాలయోగి కలలను నెరవేరుస్తానన్నారు. ప్రతీఒక్కరూ సైకిల్‌గుర్తుపై ఓట్లువేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు పొన్నమండ రామలక్ష్మి, మాజీఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన సుంకరపాలెం సర్పంచ్

వైసీపీ పాలనపై విసుగుచెందిన సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు గురువారం టీడీపీలో చేరారు. కోరింగ పంచాయతీ సీతారామపురం, ప్రతాప్‌నగర్ గ్రామ పెద్దలు, ప్రజలు బుచ్చిబాబుతో గ్రామ అభివృద్ధిపై చర్చలు జరిపి టీడీపీలో చేరారు. బుచ్చిబాబు వారికి టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పెయ్యల శ్రీనివాసరావు, కొత్తపల్లి అప్పారావు, మోకా విష్ణుప్రసాద్, దడాల భైరవమూర్తి, దడాల శ్రీనివాసరావు ఉన్నారు.

ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం, మే 9: రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించేందుకు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం ముమ్మిడివరం నగర పంచాయతీ 17వ వార్డు బళ్లగేటు, మార్కెట్ యార్డు, గౌడవీధి, స్టేట్‌బ్యాంకు ప్రాంతం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంతాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలను వివరించి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు దాట్ల సుబ్బరాజు, గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. వారివెంట దొమ్మేటి రమణకుమార్, బొక్కా రుక్మిణి, మురళీగౌడ్, పిల్లా అనూష, జేజిబాబు, నిమ్మకాయల దుర్గ, కర్రా దుర్గాప్రసాద్, రెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

కొబ్బరి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కృషి





పుల్లేటికుర్రులో అంబేడ్కర్‌కు నివాళులుర్పిస్తున్న గిడ్డి సత్యనారాయణ, పుల్లేటికుర్రులో పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న సత్యనారాయణ




పుల్లేటికుర్రులో టీడీపీలో చేరిన శ్రేణులతో కూటమి నేతలు

పి.గన్నవరం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, మే 9: కోనసీమ ప్రాంతంలో అపారమైన కొబ్బరి పంట ఉందని, ఇక్కడ పరిశ్రమలు లేకపోవడంతో కార్మికులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ప్రాంతంలో కొబ్బరి పరిశ్రమలను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రులో ఆయన పర్యటించారు. ప్రచారానికి వెళ్తున్న ఆయనకు మహిళలు హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూకూటమి అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే కూటమి ప్రభుత్వం విజయం ఖాయమన్నారు. గిడ్డి సత్యనారాయణకు గాజుగ్లాసు గుర్తు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ ఇంటి వద్ద పలువురు టీడీపీలో చేరారు. వారికి గిడ్డి సత్యనారాయణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రజక సంఘ నాయకులు గిడ్డి సత్యనారాయణను సత్కరించారు. ఎమ్మార్పీఎస్ రూపొందించిన పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. జనసేన, టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్లు పీలా రామకృష్ణ, షేక్ సుభాన్, సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, నాయకులు డొక్కా నాథ్‌బాబు, బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, వాసంశెట్టి కుమార్, చిన్నం బాలవిజయరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, దాసరి శ్రీనివాసరావు, దొమ్మేటి సురేష్‌కుమార్, దొమ్మేటి సాయికృష్ణ, వీరారవి, బోణం నాని, వాసంశెట్టి పల్లంశెట్టి, వాసంశెట్టి వరలక్ష్మిచినబాబు, వక్కలంక బుల్లియ్య, దొమ్మేటి సురేష్‌కుమార్, నేదనూరి పెద్దిరాజు, జొన్నాడ మేరీగ్రేస్ పాల్గొన్నారు.


శెట్టిబలిజలకు అండగా ఎన్డీఏ కూటమి టీడీపీలో 50మంది చేరిక



అంబాజీపేటలో టీడీపీలో చేరిన వారితో పార్టీ నాయకులు

అంబాజీపేట, మే 9: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే శెట్టిబలిజలకు అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు అన్నారు. మాచవరం పరిధిలోని పోతాయిలంకలో టీడీపీ జిల్లా బీసీసెల్ ప్రధాన కార్యదర్శి బొంతు పెదబాబు, దొమ్మేటి రామారావుల ఆధ్వర్యంలో 50మంది వివిధ పార్టీలకు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సుంకర బాలాజీ, అరిగెల బలరామమూర్తి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, గుడాల ఫణి, దొమ్మేటి శ్యామ్, అరిగెల సూరిబాబు, షైపాల తాతాజీ, పితాని రామకృష్ణ, మట్టపర్తి శ్రీరాములు, అరిగెల సూరిబాబు, కొర్లపాటి గోపి, రవణం రాము, మట్టపర్తి రమేష్, చప్పిడి సుబ్రహ్మణ్యం, మట్టపర్తి వెంకటేశ్వరరావు, మట్టపర్తి శ్రీనివాసరావుపాల్గొన్నారు. అలాగే ముక్కామలలో బ్రాహ్మణ సంఘం నాయకుడు దువ్వూరి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కూటమి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



ఆత్రేయపురం, మే 9: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. గురువారం ఆయన ర్యాలి, అంకంపాలెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ర్యాలి వంతెన వద్ద నుంచి వేలాది మంది కూటమి శ్రేణులు మోటారు సైకిళ్లపై ర్యాలీగా తరలివచ్చారు. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ ప్రచారంలో పాల్గొన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ జెండాలతో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డ్రోన్ సాయంతో బండారుపై పూలవర్షం కురిపించారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. రెండు గ్రామాల్లో విశేష స్పందన లభించింది. కూటమి మేనిఫెస్టోలోని పథకాలను కరపత్రాల రూపంలో అందజేశారు. ప్రచారంలో సమితి మాజీ అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, మాజీ సర్పంచ్ పి.ఫుల్లంరాజువర్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు మెర్ల నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పాలంగి రవిచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి కరటూరి నరసింహరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కుదప కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అంకంపాలేనికి చెందిన యడ్ల సత్యనారాయణ, కందుల లక్ష్మణరావు, చింతా శేషయ్య, హనుమంతు, ర్యాలికి చెందిన యెరుబండి సత్తిబాబు, గుమళ్ల అప్పారావు, ఎస్సీ నాయకుడు కుంచే శేఖర్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం







అమలాపురం: జనుపల్లిలో అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు ప్రచారం, జనుపల్లిలో టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఆనందరావు, చల్లపల్లిలో ఆనందరావు ఎన్నికల ప్రచారం

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు





పేరూరులో ఇంటింటా ప్రచారంలో నాయకులతో కలిసి ఆనందరావు సతీమణి అరుణ, ఆనందరావును పూలమాలతో సత్కరిస్తున్న ప్రజలు

అమలాపురం రూరల్, మే 9: మరో మూడు రోజుల్లో రాష్ట్రాన్ని స్వర్ణయుగం వైపు నడిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. గురువారం ఆయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి జనుపల్లి, పాలగుమ్మి, సవరప్పాలెం తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జనుపల్లెమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు అపూర్వస్వాగతం పలికారు. పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పాలగుమ్మిలో మహిళలుహారతులిచ్చి స్వాగతం పలికారు. సవరప్పాలెంలో రోడ్‌షో నిర్వహించారు. ఆనందరావు సతీమణి అరుణ పేరూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రకార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జవెంకటలక్ష్మి, పొలమూరి ధర్మపాల్, ఆవుపాటి వేణుగోపాల్, దంగేటి వెంకటేశ్వరరావు, అధికారి బాబ్జీ, మంద గెద్దయ్య మట్టపర్తి భారతి, దంతులూరివాసురాజు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు సీఎం కావాల్సిందే

ఉప్పలగుప్తం, మే9: జగన్ పాలనలో అభివృద్ధిలో ఇరవై ఏళ్ల వెనక్కిపోయిన రాష్ట్రాన్ని బాగు చెయ్యాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావలసిన ఆవశ్యకత ఉందని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గురువారం ఆయన జనసేన, బీజేపీ నాయకులతో కలిసి చల్లపల్లి పంచాయతీ పరిధిలోని పలుప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీఏరియాల్లో విశేష స్పందన లభించింది. పలుచోట్ల అభ్యర్థి ఆనందరావు, కూటమి నాయకులను ప్రజలు పూలమాలలతో సన్మానించారు. టీడీపీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, బూసి బుజ్జిదొర ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో కూటమి నాయకులు మెట్ల రమణబాబు, చెరుకూరి సాయిరామ్, పలచోళ్ల పద్మనాభం, ఇసుకపట్ల రఘుబాబు, దంగేటి బాబులు, గొలకోటి చిన్నా, ఆకుల జోగారావు, సుంకర బుజ్జి, పోలిశెట్టి శివాజీ, యరగర్ర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.